
# కొత్త పూస

కపిల వెంకటరావుగారు, బి. ఏ., బి. యల్.

కార్యంపూడి స్టేషనుకి కొత్త ఇన్‌స్పెక్టరును వేశారని పుకారు పుట్టింది. ముందూ వెనకా చూడకుండా ఎంతపనైనా చేయగల ఉద్దండుట్ట. పేరు రాజగోపాలం నాయుడు. ఎక్కడో కర్నూలులోను, కడపలోను పనిచేసి దోపిడిదొంగల్ని పట్టుకొని వప్పజెప్పాడుట. భీముడి కీ సంగతి తెలిసింది. మీసం మెలివేసి, తల పంకించాడు. ఏ ఇన్‌స్పెక్టరు వస్తే మన కేమి, మన్నేం జేస్తా డనుకున్నాడు. భీముడు దొంగల నాయకుడు. కార్యంపూడి కొండలలో వాడి కాపురం. లంబాడీవాళ్లని, ఎక్కడెక్కణ్నుంచో కోయవాళ్లని, తెచ్చి ఆకొండలలో పెట్టి, దార్లు కొట్టుతూ ఉంటాడు. వాడి రూపం భయంకరంగా ఉంటుంది. ఒక అంగవస్త్రం (అదీ నాయకుడు కాబట్టి), అదైనా మోకాళ్లు దిగకూడదు; పైని ఒక రంగురంగుల కుచ్చుపాగా, బవిరిగడ్డం, కోరమీసం, ఆలిచిప్పల్లాగు పెద్దవిగాను జ్యోతుల్లాగు ఎఱ్ఱగాను ఉండే కళ్లు, చేతిలో ఒక గునపంలాంటి కఱ్ఱ, నల్లగా పొడుగ్గా ఉండేవిగ్రహం. వాడిమెడలో ఒక పూసలపేరుంది. విశాలమైన వాడి ఎదురురొమ్ముమీద, పొట్టమీదా, చిందులాడుతుంటుందా పూసలపేరు. చూడడానికే గాని, అవి నిజంగా పూసలు కావు. మనుష్యుల తాలూకు ఎముకలు తీసి, అరగదీసి చేసిన పూసలవి. వాడు స్వయంగా చంపిన ఒక్కొక్కమనిషికి ఒక్కొక్కపూస చేశాడు వాడు. అల్లాటివి యిప్పుడు పద్నాలుగు పూసలున్నాయి. భీముణ్ని చూస్తే ప్రతివాడికి భయమే. పోలీసువాళ్లకి మరీని. ఆ భయంచేత పోలీసువాళ్లు వాణ్ని ఏమీ చేసేవారు కారు. భీముడికి సంబంధించినంతవరకు పోలీసు డిపార్టుమెంటు లేదన్నమాటే. ఎక్కడ దొంగతనం జరిగినా, ఎక్కడ హత్య జరిగినా భీముడు చేశాడని జిల్లా జిల్లా అంతా తెలుసు. ఆఫీసర్లందరికీ తెలుసు. అయితే వాణ్ని పట్టడానికి గుండె ఉన్న పోలీసు ఇన్‌స్పెక్టరు ఒక్కడూ లేడు. భీముడి జులుం నిరంకుశంగా సాగిపోతున్నది.

సరే, రాజగోపాలంనాయుడు వచ్చాడు. చార్జీ పుచ్చుకున్న మరునాడే ఆయన భీముడికి కబురు పంపించాడు. భీముడు వచ్చాడు. వాణ్ని చూచి నాయుడుగారు ఇల్లా చెప్పారు: "ఒరేయి, ఈవేళనుంచి నా ఫిర్కాలో ఎక్కడెక్కడ దొంగతనం జరిగినా, దారిదోపిడి జరిగినా, మనిషి చచ్చినా నిన్ను ఖైదులో వేస్తాను. నువ్వు నేరం చేసినా సరే, చేయకపోయినా సరే. ఒక్కసూది పోయినా నీకు ఖైదు తప్పదు. ఒక్కచీమ అన్యాయంగా చచ్చినా నిన్ను నిలబెట్టి తుపాకితో కాలుస్తాను. వెళ్లు."

భీముడికి ఆశ్చర్యం వేసింది. నవ్వూ వచ్చింది. "బాబు, పెబువులు తమురు. మాట తప్పకూ డుదు దొరా" అని విరసంగా అన్నాడు ఇకి




"అయ్యగోరు ఈదండ సూచిన్రా? ఈడ పద్దాలుగు......తల్లికి"

లిస్తూ. "అయ్యగోరు ఈదండ సూచిన్రా? ఈడ పద్దాలుగు పూస లుండయ్యి. పద్దాలు గుర్ని బలిచ్చి నన్నమాట మంత్రాలమ్మకి. కారెంపూడి కనుమలో లేదూ మొదలుంగా, ఆ మంత్రాలమ్మ తల్లికి"—అన్నాడు.

ఊరంతా తెలిసిపోయిందీమాట. నిజంగా నాలుగురోజులకే ఒకపెద్ద దొంగతనం జరిగింది. పెళ్లివాళ్లు పెళ్లిచేసుకుని వస్తున్నారు వినుకొండనుంచి. నగలు గిగలూ యావత్తూ ఎగిరిపోయినాయి, కారెంపూడి కనుమలో, నాగులేటి ఒడ్డున. వచ్చి రిపోర్టుచేశారు, కారెంపూడి పోలీసుస్టేషనులో. ప్రజలంతా కనిపెట్టి చూస్తూన్నారు ఏం జరుగుతుందో అని ఇన్స్పెక్టరు వెళ్లి భీముణ్ణి పట్టుకుంటాడా పట్టుకోడా, అని. వారంరోజులయినా రాజగోపాలం నాయుడు ఎట్టి చర్యలూ తీసికోలేదు. భీముడు మీసాలు దువ్వి, 'ఈడు కబుర్ల నాయుడు' అన్నాడు. విన్నవాళ్లు నవ్వారు. ఇట్లా ఉండగా, ఒక అర్ధరాత్రి వేళ, చంద్రుడు మేఘాలచాటుగ ఉండి, ప్రపంచమంతా అంధకారంలో ఉండగా, తుప్పర వానలో, ఈదురుగాలిలో రాజగోపాలం నాయుడు ఒక్కడూ అడవిలోకి వెళ్లి, మంత్రాలమ్మ గుడిదగ్గర పూజ చేస్తూఉన్న భీముణ్ణి ఎరెస్టు చేసి తీసుకువచ్చి ఖైదులో పెట్టాడు. ఆబాలవృద్ధులూ ఆశ్చర్యంతో గుండె బాదుకున్నారు. రాజగోపాలం నాయుడికి 'ఆడి తప్పని దొర' అని బిరుదిచ్చారు...మర్నాడే, పోలీసుస్టేషను ఎదురుగుండా ఉండే ఒక తోటలో దొరికాయి పోయిన నగలన్నీ, ఎవరో మరిచిపోయి వెళ్లినట్లుగా. పూచికపుల్లతోసహా దొరికాయి. భీముడిమీద కేసు ఋజువు కాలేదని వాణ్ణి వదలిపెట్టారు.

తదాది వాడికి చెప్పరాని భక్తి కలిగింది రాజగోపాలం నాయుడుగారిమీద. నాయుడు ధైర్యసాహసాలు చూచి,లంచాలూ, సప్లైలూ



"అక్కడ డబ్బీలో ఉన్న ఒకచుట్టతీసి ,......వ్యక్తీపరిచాడు."

పట్టకపోవడం చూచి, అడవిజంతువు లాంటి భీముడు ముగ్ధుడై అతనికి వశు డైపోయాడు. మళ్లీ దొంగ తనాలు లేవు. కారెంపూడిలో, నాయకురాలి కనుమలో, మేళ్ల వాగు కొండల్లో —— ఎక్కడా దారి దోపి డీలు లేవు. భీముడూ నాయుడూ మంచి స్నేహితు లైనారు...రాజ గోపాలం నాయుడు కారెంపూడి వచ్చిన రెండేళ్లకు కుమార్తె వివా హం తలపెట్టుకున్నాడు. ఆయనకు నచ్చిన సంబంధం దొరికింది. వరుడు సమాన పాయాగల కుటుంబానికి చెందినవాడు; చదువుకున్నవాడు. అన్ని విధా లా అనుకూల మయిన బాంధవ్యం అవడం చాతనూ, తనకు ఉన్నదల్లా ఒక్కేపిల్ల అవ డంచాతనూ నాయుడుగారు విశేషప్రయత్నం చేస్తున్నారు పెళ్లికి. పెళ్లి సరఫరా యావత్తూ భీముడి భుజాలమీద పడ్డది. ఊపిరి పీల్చడానికి తీరిక లేకుండా తిరుగుతూన్నాడు వాడు, కన పడ్డవాళ్లనల్లా తిట్టుతూ.

పెళ్లి రేపనగా ఈవేళ ప్రొద్దున్న రాజ గోపాలంనాయుడు అర్జంటుకాగితాలు చూచు కుంటూ కూర్చున్నాడు గదిలో. కిటికీ అవతల భీముడు గోంగూరబస్తాలు, పచ్చిమిరపకాయల బస్తాలు లెక్కపెట్టిస్తున్నాడు. ఇంతలో ఎవరో వచ్చి 'గోపాలంనాయుడుగారి యిల్లు ఇదేనా?' అని అడిగారు. అవునని అక్కడ ఉన్న జమాను చెబితే, అతడు "నాయుడుగారు ఇంట్లో ఉన్నారా" అని అడిగి తిన్నగా లోపలికి వచ్చాడు. కాగితాలమీదనుంచి తల మెత్తాడు నాయుడు. ఆయనకు ఎక్కడో విన్నట్లుగా ఉన్నది ఈ కంఠస్వరం. వీధి గుమ్మంలోనుంచి ఆ వచ్చినతడు తిన్నగా లోపలికి వచ్చి గది తలుపు తోసి, అక్కడే నిలబడి, నవ్వు ముఖంతో, "నాయుడుగారూ, నమస్కారం" అన్నాడు.

నాయుడు తెల్లబోయినాడు. "నీవా, నీవు ఇక్కడికెల్లా వచ్చావు?" అని మునిగి పోయేవాడు మాట్లాడినట్లు అడిగాడు. ఆ వచ్చినవాడు తిన్నగా వచ్చి కాళీగా ఉన్న కుర్చీలో కూర్చొని, అక్కడ డబ్బీలో ఉన్న ఒకచుట్ట తీసి ముట్టించి, చుట్టసౌఖ్యం అనుభ విస్తున్నట్లుగా ఆనందం వ్యక్తపరిచాడు.

"నీవు బతికున్నావా? ఎట్లా బతికావు? ఎక్కడున్నావు ఇన్నాళ్లూ? ఎందుకు వచ్చావు ఇక్కడికి?" అన్నారు నాయుడుగారు. వచ్చినతడు నవ్వాడు. "హెహెహె...నీకు తెలియదూ, ఎందుకో? చచ్చిపోయినా ననుకున్నావా? శని విరగడైందని సంతోషించావా? అదీ, నువ్వూ కులుకుతూ ఉండొచ్చుననుకున్నావా? నీకు పుట్టినకూతురుకు పెళ్లి చేస్తావట కాదూ?" అన్నాడు. వాడిముఖము జేవురించింది. నాయుడు మాట్లాడలేదు.

"నేను నిన్ను వెంటాడిస్తునే ఉన్నాను. నాడు దాని తల్లిని చంపినందుకు నాకు వేసిన శిక్ష యావత్తూ అనుభవించి, అండమాన్నుంచి మళ్లీ బర్మా వెళ్లేను. అక్కడ వాళ్లు అది ఆపూరిలో లేదని చెప్పారు. స్వదేశం వెళ్లిపోయారని చెప్పారు. నీవు ఆదేశంలో ఉద్యోగం మానుకుని మద్రాసు పోయినావనీ తెలిసింది. రెండూ రెండూ కలిపితే నాలుగైంది. మద్రాసు వచ్చి వాకబుచేస్తే నీవు గుంటూరులో ఉన్నావని చెప్పారు. గుంటూరు వచ్చి, తర్వాత యిక్కడకు వచ్చాను. నాగులేట్లో స్నానం చేస్తూంది, దాన్ని చూచాను. ఇక్కడ కూర్చున్నావు, నిన్ను చూచాను." అన్నాడు. రాజగోపాలం నాయుడు నిర్విణ్ణుడైపోయాడు. ముందుకు వంగి ఆయన "ఎన్ని రూపాయిలిస్తే పోతావు? ఎన్ని వందలివ్వను? ఎన్నివేలివ్వను? చెప్పు, రెడ్డీ" అన్నాడు.

రెడ్డి మళ్లీ నవ్వాడు. "నాకు వందలు వేలు అవసరములేవు. నాకు కావలసిందల్లా దానికీ, దాన్నిబట్టి నీకూ సౌఖ్యం లేకుండా చెయ్యడమే. మీయిద్దరూ ఆలుమగలని అంతా నమ్ముతున్నారుగా—అందరికి చెప్పి నీగుట్టు బయలు పెడతాను" అన్నాడు.

రాజగోపాలంనాయుడు నిస్సారంగా కుర్చీలో వెనక్కు పడ్డాడు. అర్ధరాత్రివేళ అటవీమధ్యంలో దొంగభీమున్ని పట్టుకొన్న సాహసుడికి ధైర్యమూ, ఆశా సడలిపోయి 'ఉస్సు' రన్నాడు...

కొంతసేపటికాయన, "ఎందుకు రెడ్డీ, నీకు మామీద కక్ష? నీవు ఎప్పుడైనా ఆమెను సుఖపెట్టావా? ఎప్పుడు జూచినా కోతపెట్టి ఏడిపిస్తుంటే నేను తీసుకువచ్చేశాను. ఇక్కడ మేము భార్యాభర్తల మని అంతా అనుకుంటున్నారు. ఒకపిల్ల పుట్టిందని కూడా నీకు తెలుసు. రెడ్డీ, మమ్మల్ని వదలివేసి వెళ్లిపో. నీకు ౧౦,౦౦౦ రూపాయిలిస్తాను. వర్తకం చేసుకో, భూములు కొనుక్కో" అన్నారు.

"అది నాభార్య. నన్ను పెళ్లిచేసుకుంది. దాన్ని నేను వెంటాడిస్తాను. నాశనం చేస్తాను." అన్నాడు రెడ్డి. "నువ్వెంత సత్యహరిశ్చంద్రుడవో, సాహస విక్రమార్కుడవో ప్రజలకు తెలియచేస్తాను. నీమీద, దానిమీద కేసు పెడతాను" అన్నాడు. రాజగోపాలంనాయుడు రెడ్డిని బ్రతిమాలుకున్నాడు. "ఆపిల్ల నిన్నేం చేసింది రెడ్డీ—దాని పెళ్లి రేపు. పెద్దయింటి కుర్రవాడికి ఇస్తున్నాను. ఇప్పుడు మమ్మల్ని బయటపెడితే నీకేం వస్తుంది? సంబంధం తపి

పోతుంది. మా॥ మూలాన్ని పిల్ల యావజ్జీవం కళంకంపాలవుతుంది. మమ్మల్ని విడిచిపెట్టు రెడ్డీ" అన్నాడు.

రెడ్డి మాట్లాడలేదు.......కొంతసేపటికి నాయుడుగారి కొక ఆలోచన తోచింది... "సరే. రెడ్డీ, నీకు మమ్మల్ని నాశనం చేయాలని ఉందన్నావు గనుక నే నొక ఉపాయం చెపుతా విను...నేను నిన్ను ఇప్పుడు ఖైదులో పెట్టగలను. నీ నోరు మూయించగలను. లేకపోతే నిన్ను అమాంతం ఖూనీచేయించి గంగ ధారిమడుగులో పారవేయించగలను...కాని అది నా కిష్టంలేదు. ఎందుకో విన్నావా? నేను నీవిషయంలో దోషిని. పేరిందేవి నీభార్య ...ఆమెను...ఏమయితే నేం...దోషం నాది. అందుచేత నీకు నన్ను శిక్షించడానికి హక్కు ఉంది. ఒప్పుకుంటాను. అయితే నీయందు దోషం చెయ్యని పిల్లదాన్ని నాశనంచెయ్యకు. నే నొక ఉపాయం చెపుతాను, విను. రేపు పెళ్లి. పెళ్లిఅయిపోగానే, అంటే ఈవేళకి ఆరోనాడు, నేను విషం త్రాగి చచ్చిపోతాను. సరేనా? పో" అన్నాడు.

"మరి దానిమాట? అదీ త్రాగాలి" అన్నాడు రెడ్డి.................

"సరే, త్రాగుతుంది. ఇప్పుడు వెళ్లిపో"

రెడ్డికి ఈఆలోచన బాగానే ఉన్నది. ద్వీపాంతరవాసశిక్ష అనుభవించిన తనమాట ఏకోర్టులో నమ్ముతారు, ఒకవేళ తాను కేసు పెట్టినా? పైగా, ఇవతలి పార్టీ సామాన్యుడా? పేరు ప్రతిష్ఠా ఉన్న ఒకపోలీసు ఇన్స్పెక్టరు. "మరి మీారిద్దరూ తప్పకుండా చస్తారా? ఏ ఊరైనా పారిపోతారేమో, నన్ను కన్నుమలిపి?" అన్నాడు వాడు.

నాయుడు—"అన్నమాట తప్పని దొర అని బిరుదు నాకు రెడ్డీ. ఆరోజు నీమెదురుగా పుచ్చుకుంటాము విషం" అన్నాడు. రెడ్డి చాలాసేపు ఆలోచించి "సరే, మళ్లీ శనివారం వస్తాను. తొమ్మిది గంటలకు వస్తాను. అప్పటికి నీవూ, అదీ సిద్ధంగా ఉండాలి. విషం నా ఎదురుగ తాగాలి. ఆవిషంకూడా నేనే తెస్తాను. ఈలోపుగా నన్ను ఖైదులో పెట్టించాలని, అదీ యిదీ ప్రయత్నం చేశావంటే నీదుంప తెంచుతాను" అని లేచి, ఇంకో చుట్ట అంటించుకొని వెళ్లిపోయినాడు.

రాజగోపాలంనాయుడుగారి యింట్లో పెళ్లి సలక్షణంగా జరిగింది. "వాసిరెడ్డి వెంకటాద్రినాయుడుగారి తర్వాత మళ్లీ అంత వైభవంగా ఎవరూ చెయ్యలేదు పెళ్లిఅ"న్నారు ప్రజలు. పెళ్లి కాగానే చుట్టాలంతా ఎవరి యిళ్లకు వాళ్లు వెళ్లిపోయినారు. పెళ్లికూతురు అత్తవారింటికి మూడు నిద్రలకి వెళ్లింది.

శనివారంనాడు శనూ్యషసమయంలో లేచి, రాజగోపాలంనాయుడు భార్యను లేపాడు. పెళ్లిబడలికచేత వాళ్లు చాలా నలిగిపోయి ఉన్నారు. నాయుడూ, పేరిందేవీ స్నానం చేసుకొని, ఆయన దక్షిణామూర్తిని, ఆమె గౌరీదేవిని పూజచేసుకున్నారు. పసుపు

రాచుకున్న ముఖంమీద, కుంకుమ బొట్టు పెట్టికొని, పేరిందేవి గౌరమ్మకు ఎర్రటి మందార పూవులు పెట్టి పూజచేసింది, నాయుడుగారూ, ఆమె ఒకళ్లతో ఒకళ్లు మాట్లాడుకోలేదు. గంభీరంగా ఉన్నారు. నాయుడుగారు కచ్చేరీ కాగితాలన్నీ సర్దేసి, ఒకపెట్టెలో పెట్టి, దానికి బీగంవేసి జాగ్రత్త పెట్టినారు. సామానుయావత్తు సర్దించారు. బంట్రోతుల్ని అందరినీ ఇళ్లకు పొమ్మన్నారు. వాళ్లిద్దరూ కూర్చున్నారు ఆగదిలో. ఇలభైఏళ్లవాడతను. కండలుతిరిగిన జబ్బలు, మెలితిరిగిన మీసాలూ, పెద్దనుదురూ, తిరుచూర్ణంతో పెట్టిన నిలువుబొట్టూ. రాజఠీవి ఉట్టిపడు తున్నది.

తొమ్మిది గంటలు కొట్టింది గడియారం. పేరిందేవికి ముఖం నల్లబడిపోయింది. గొంతుకలో ఏదో అడ్డంపడినట్లు నొప్పిగా ఉన్నది. పెదవి ఊరికే వణుకుతున్నది. అయితే, ఉలుకు లేదు, పలుకు లేదు.

"ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది. ఇంక వస్తాడు. గిన్నె తెచ్చావా?" అన్నాడు నాయుడు.

మాట్లాడబోతే పేరిందేవికి మాట రాక వలవల యేడ్చింది. "అయ్యో, అయ్యో, మన కీ ఆపత్తు మళ్లీ ఎక్కడ సంభవించిందండోయి. నామూలాన్న మీ కెన్ని చిక్కులండోయి..." అని బొరుమని ఏడ్చింది. రాజగోపాలంగారి కసరతు చేసి గట్టిపడిన ఛాతీక్రిందకు, పైకి ఉబికింది. అంతే, ఆతనినోట మాటలేదు. కళ్ల నీళ్లు లేవు. మొహం మాత్రం అటు తిప్పకున్నాడు. పేరిందేవిని ఏడవవొద్దని చేతితో సంజ్ఞచేశాడు.

మరి రెండునిమిషాలకు అడుగుల చప్పుడైంది. "అయిపోయిందండోయ్" అని పేరిందేవి వెక్కివెక్కి ఏడుస్తుంటే, రాజగోపాలంగారు, "తప్పు" అని చెప్పి, ఆకాశంవేపు వేలు చూపించాడు, దేవుణ్ని ప్రార్థించమని. అడుగులచప్పుడు దగ్గరగా వచ్చింది. పేరిందేవి కళ్లు తుడుచుకుని కూర్చున్నది. వాడికళ్ల పడకూడదు తన ఏడుపూ, తన భయమూను.

రాజగోపాలంగారు సర్దుకు కూర్చున్నాడు, గడియారం చూస్తూ. విషాలు అనేకరకాలున్నాయి. పుచ్చుకోగానే ప్రాణం పోయేది తెస్తే బాగుండును వాడు......


అడుగులచప్పుడు మరీ దగ్గరకు వచ్చింది. తలుపు తోశా రెవరో.

రాజగోపాలంనాయుడు — "నీవు వచ్చావేం, భీముడూ? నిన్ను ఇప్పుడు రావద్దని చెప్పలేదూ, పో—౧౨ గంటలకి రా . . . పో, భీముడూ......"అంటూ వాడివైపు చూచాడు. వాడిముఖంలో ఎందు కాచిరునవ్వు? ఎందుకల్లా నిల్చుని బోర విరుచుకుంటాడు వాడు, ఏదో ఘనకార్యం చేసినట్లు?

"ఆయేళ నాను వొయినం అంత యిన్నాను దొరా" అని మెడలో హారం చూపించాడు. అందులో ఒక క్రొత్తపూస గుచ్చి ఉన్నది.

"నువ్వొచ్చినేనక మంత్రాలమ్మకి ఇదే దొరా, బలి" అన్నాడు భీముడు...

'ఆడి తప్పని దొర'ఏమి చేస్తా డిప్పుడు ?



# వా న కా రు

శ్రీ రాజా విక్రమదేవ వర్మగారు

వానకారున రెండవపక్షు నిశిని
మబ్బుచేతను శశిలేమి మహినిమింట
సాంద్రతమ మగుతమము ప్రచారితమయి
యాఋతువు కాళికాయుక్త మగుటఁజాటు.

మెఱుము దానివెలుఁగునాల్క; యుఱుము [భయద
గర్జనము; గాలిహాసనము; కరకలెన్న
మాలయందలి శిరములు; రాలువాన
యాతలలనుండికాఱెడు నస్రమరయ.

నలుపుతోనొప్పు నష్టదిక్కులె పటంబు
కరము వెఱపించు నారూపుఁగనుచుఁ బిఱికి
రిక్కదమి మబ్బుచాటున నక్కు; భక్తి
గల కృషీవలసంతతియలరు మదిని.